చెరువు మట్టి .. చేనుకు పుష్టి


చెరువులో నుంచి పొలాలకు ట్రాక్టర్ ద్వారా ఒండ్రు మట్టిని తరలిస్తున్న దృశ్యం


ఓ రైతు పొలంలో సారవంతమైన చెరువు మట్టి వేసుకుంటున్న దృశ్యం

- పుష్కలంగా పోషకాలు లభ్యం
- అధిక దిగుబడులకు ఆస్కారం

రొద్దం: పంట భూముల్లో క్రమేపీ సేంద్రియ పదార్థాలు తగ్గిపోతుండటంతో వర్షపు నీటిని నిలువుకొనే సామర్థ్యం కోల్పోయి దిగుబడి సరిగ్గా రావటం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూముల్లో సారం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో రైతులు చెరువుల్లోని మట్టిని భూముల్లో వేయడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో చాలా చెరువుల్లో నీరు అడగంటిపోయింది. ఆయా చెరువుల్లో మట్టిని పంట భూముల్లో వేసుకుంటే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఎండిపోతున్న చెరువులు

గ్రామాల్లో వర్షాధార చెరువులు ప్రస్తుతం చాలా వరకు ఎండిపోయాయి. ఈ చెరువుల్లో 2 నుంచి 3 అడుగులు మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. దీనికి భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే ఇంకా మంచిది. జేసీబీ, ట్రాక్టర్లతో తక్కువ ఖర్చుతో రైతులు మట్టిని తరలించుకునే అవకాశం ఉంటుంది. తరువాత ఎంబీ నాగలితో పాటు రోటోవేటర్‌తో కలియదున్నితే భూమి అప్పటికే ఉన్న మట్టితో ఇది కలసిపోయి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది.

ఒండ్రు, బంకమట్టి ఎంతో మేలు

వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తయిన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రు మట్టి, వివిధ పొళ్లలో కుళ్లిన వ్యర్థ పదార్థాలతో కలిసి చెరువుల్లోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు మట్టి, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. చెరువు మట్టివల్ల పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణ పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు. రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది. విలువైన సేంద్రియ, కర్బన పదార్థం అందివ్వడంతో మొక్కలు నీటి ఎద్దడి తట్టుకుని దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నాణ్యమైన దిగుబడులు



రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి తమ భూముల్లో సారం పెంచుకోవడం కోసం పశువుల పేడతో పాటు చెరువు మట్టిని వేసుకుని కలియదున్నాలి. పంటలకు అసరమయ్యే పోషకాలు మెండుగా లభించి తద్వారా పంట పైరు ఏపుగా ఎదుగుతుంది. నాణ్యమైన అధిక దిగుబడులు సాధించిడానికి అవకాశం ఉంది.

– శంకర్‌నాయక్, ఏఓ, రొద్దం

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం


ఎన్నికల సరళిపై నాయకులతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. బుధవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడుతో కలిసి సార్వత్రిక ఎన్నికల సరళిపై నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 59 నెలల కాలంలో అన్ని వర్గాల ప్రజలకు కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసిన కూడా ప్రజలు వైఎస్సార్‌సీపీ అండగా నిలిచారని స్పష్టం చేశారు. పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ క్యూలైన్లో నిలిచి వృద్ధులు, వికలాంగులు, మహిళలు చరిత్రలు ఎన్నడూ లేని విధంగా తమ ఓటు హక్కును వినియోగించున్నారన్నారు. గత మూడు నెలల కాలంగా వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, సర్పంచ్ కరుణాకర్‌గౌడు, నాయకులు బీహెచ్ రాయుడు, నాగరాజు, రమేష్, తిప్పేస్వామి, హనుమంతరాయప్ప, దేవరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

- జూన్ 4న కౌంటింగ్‌కు ఏర్పాట్లు
- ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు



మడకశిర: నియోజకవర్గంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ గౌరీశంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎస్‌ఓలు, రూట్ ఆఫీసర్లు, ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ టీం సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వీరందరూ ఎన్నికల విధుల్లో పాల్గొని ఈసీకి పూర్తిస్థాయిలో సహకరించారని తెలిపారు. అదే విధంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని విధాలుగా సహకారం అందించారని పేర్కొన్నారు. మీడియా సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం కూడా పూర్తి స్థాయిలో ఉండడంతో పోలింగ్ ప్రశాంతంగా జరపడానికి అవకాశం ఏర్పడిందన్నారు.

ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు

హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని గౌరీశంకరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు నిబంధనల ప్రకారం కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియను కూడా సజావుగా పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఆర్డీటీ సెట్ హాల్ టికెట్ల పంపిణీ

రొళ్ల: గ్రామీణా ప్రాంతాల్లో ఇష్టంగా చదివే బాల, బాలికలను సమాజంలో ఉన్నతమైన స్థానంలో స్థిరపడేటట్లు ప్రోత్సహించడమే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ ఏటీఎల్ ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో రొళ్ల, అగళి మండలానికి చెందిన 46 మంది విద్యార్థులకు ఆర్డీటీ సెట్ అర్హత పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏటీఎల్ ఓబులేసు మాట్లాడుతూ ఆర్డీటీ ద్వారా గణితం, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన 100 మార్కులకు అర్హత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆరేళ్ల పాటు వివిధ కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించి ఉచితంగా చదివించడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్లు అందుకున్న విద్యార్థులకు ఈ నెల 19న హిందూపురం బస్టాండ్ సమీపంలోని ఎస్ఎస్‌పీఆర్ బాలికల డిగ్రీ కళాశాలలో ఆర్డీటీ సెట్ అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఓలు హనుమంతరాయప్ప, శివప్రసాద్, వెంకటేశులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


రొళ్లలో సెట్‌కు ఎంపిక అయిన విద్యార్థులకు హాల్ టికెట్లు అందిస్తున్న ఏటీఎల్ ఓబులేసు

గిరిజన గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

సోమందేపల్లి: మండలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1, 4వ తరగతిలో ఎస్టీ 36, 5వ తరగతి ఎస్టీ 29, 6వ తరగతిలో 7, 7వ తరగతిలో 5, 8వ తరగతిలో 1, 9వ తరగతి 8 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 20లోపు పాఠశాలకు వచ్చి చేర్పించవచ్చన్నారు.

రేపటి నుంచి గంగమ్మ తిరునాల

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు గంగమ్మ తిరునాలు నిర్వహించనున్నట్లు అలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 17న ఉదయం 9 గంటలకు అమ్మవారికి కలశపూజ, అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 18న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రికి సంగీత భక్తి పాటల కచేరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 19న తెల్లవారుజామున 2గంటలకు అమ్మవారికి జ్యోతులు, బోనాల సమర్పణ, సాయంత్ర 3 గంటలకు ఉట్ల తిరునాలతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సాయిబాబా ఆలయ సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంలో రాధాకృష్ణ, మూర్తి చాలకూరు వైపు వెళ్తుండగా ఆవు అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడ్డారు. వారిద్దరికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాధాకృష్ణ తలకు తీవ్రగాయాలు కాగా హిందూపురం తరలించనున్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన రాధకృష్ణ మూర్తి

హిందూపురంలో ఇద్దరు...

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని సంతేబిదనూరు గేటు వద్ద మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఆటో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొటిపి గ్రామానికి చెందిన నాగరాజు, మరో వ్యక్తి గాయపడినట్లు పోలీసులు తెలిపారు. సమీపంలోని వారు వెంటనే వారిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. తరువాత మెరుగైన చికిత్స కోసం నాగరాజును అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మరో వ్యక్తి హిందూపురం ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు పేర్కొన్నారు.

చిలమత్తూరులో మరో ఇద్దరికి...

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి లాలేపల్లి క్రాస్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి 7.30 సమయంలో బాగేపల్లి వైపు నుంచి వస్తున్న గోరంట్లకు చెందిన ఓ వ్యక్తి లాలేపల్లి నుంచి వైవే దాటుతున్న బాలు అనే వ్యక్తిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గోరంట్లకు చెందిన ద్విచక్ర వాహనదారుడి తలకు గాయం కాగా, చేయి మనికట్టు విరిగిపోయింది. క్షతగాత్రులను హుటాహుటిన హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కనుల పండువగా పెద్దమ్మ, మారెమ్మ జాతర


కమ్మూరులో బోనాలను తీసుకెళుతున్న గ్రామస్తులు

కూడేరు: కమ్మూరులో గ్రామదేవతలైన పెద్దమ్మ, మారెమ్మ అమ్మవార్ల జాతరను గ్రామస్తులు కనుల పండువగా జరుపుకున్నారు. బుధవారం గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో మంగళ వాయిద్యాల నడుమ బోనాలతో పెద్దమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ బోనాలలో తెచ్చిన తీపి పదార్థాలను అమ్మవార్లకు నైవేద్యంగా పెట్టారు. ఆలయ అర్చకులు పెద్దమ్మ, మారెమ్మ దేవతలకు క్షీరాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు జంతు బలి దానం ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కర్బూజా సాగు.. లాభాలు బాగు


కాయలను తొలగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: కర్బూజ పంట సాగు రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. నియోజకవర్గంలో బోరు బావుల కింద దాదాపు 100 ఎకరాలకుపైగా రైతులు కర్బూజ పంటను సాగు చేశారు. విత్తనం , ఎరువులు మందు, కూలీ తదితర వాటికి ఎకరాకు రూ.90 వేల చొప్పున రైతులు ఖర్చు చేసి పంట సాగు చేశారు. ఎకరాకు 12 టన్నులపైగా దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.27 వేల వరకూ ధర పలుకుతోంది. ఎకరాకు ఖర్చులు పోను రూ.లక్షకు పైగా వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.


విరగ్గాసిన కర్బూజ కాయలు

మంచి దిగుబడి వచ్చింది



బోరు బావి కింద ఎకరాకు 90 వేల చొప్పున ఖర్చుపెట్టి ఏడు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా కర్బూజా పంటను సాగు చేశా. రెండు విడతల్లో 135 టన్నులు దిగుబడి వచ్చింది. పొలం వద్దనే టన్ను రూ.27 వేల చొప్పున విక్రయించాను. పెట్టిన ఖర్చులు పోనూ రూ.21 లక్షల వరకు ఆదాయం వచ్చింది. కష్టానికి ఫలితం దక్కడం సంతోషంగా ఉంది.

– దివాకర్, రైతు, చెందకచెర్లు, మడకశిర మండలం

క్లుప్తంగా

ఉన్నతస్థాయికి ఎదగాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్

పావగడ: భవన నిర్మాణ కార్మికుల పిల్లలు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో షిర్డి సాయిబాబా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్మికుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల పిల్లలు కార్మికులే కానక్కర్లేదని బాగా చదువుకుని ఉన్నత చదువుల్లో రాణించి ఉన్నతస్థానాల్లో నిలవాలన్నారు. కార్మికశాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందిన కార్మికులకు ప్రభుత్వం అనేక సౌలభ్యాలు అందిస్తోందన్నారు. పిల్లల విద్యాభ్యాసానికి, వివాహాల ఖర్చులకు నిధులు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి , పదాధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

రొద్దం: క్షేత్రస్థాయి సహాయకులు కూలీలను పెంచేందుకు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీపై పథకంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కూలీలు ఎక్కువ శాతం రావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ , ఈసీ, ప్లాంటేషన్ మేనేజర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


మడకశిరరూరల్: స్థానిక గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ప్రారంభించారు. 24 రోజుల పాటు ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మరింతగా మేథాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ నాగేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వర్టు వద్ద మరమ్మతు పనులు


తెగిపోయిన కల్వర్టు వద్ద మట్టి వేసి గుంతను పూడుస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామ సమీపంలో మడకశిర జాతీయ రహదారి పక్కన వెలసిన ఈశ్వరుడి ఆలయానికి చేరుకొనే సీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన కల్వర్టు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తెగిపోయింది. బుధవారం 'సాక్షి'లో 'కల్వర్టును బాగు చేయండి' అన్న శీర్షిక కథనం రావడంతో సంబంధితశాఖ అధికారులు స్పందించారు. జేసీబీ సహాయంతో కల్వర్టు వద్ద ఏర్పడిన భారీ గుంతను రాళ్లు, మట్టితో తాత్కాలికంగా పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు స్పందించి మట్టితో గుంతను పూడ్చి రోడ్డును బాగు చేయడంతో భక్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, పాఠకులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

పరిసరాలు శుభ్రం చేసుకోండి


కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

అమరాపురం: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ వాగేష్ , ఈఓ భాస్కర్ తెలిపారు. బుధవారం స్థానిక తమ్మడేపల్లి రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీ, పాత పంచాయతీ కార్యాలయంలోని వీధుల్లో పేరుకు పోయిన చెత్తా చెదారం తదితర వాటిని పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. కుండపోత వర్షం పడటంతో మట్టి తదితర వాటితో కాలవలు పేరుకు పోవడంతో వాటిని కార్మికులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాగేష్, పంచాయతీ ఈఓ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. దీని వల్ల దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు.

'పురం'లో నీటి సరఫరాకు అంతరాయం

హిందూపురం: హిందూపురం మున్సిపాల్టీ పరిధిలో ఎస్‌కేడీ వాటర్ లిఫ్టింగ్ స్టేషన్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ప్యానల్ బోర్డు మరమ్మతు కారణంగా పట్టణానికి నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిపేరి చేయడానికి సమయం పడుతున్న కారణంగా నీటి సరఫరా పునరుద్ధరణకు రెండు రోజులు పడుతుందన్నారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.

సజావుగా మండల మీట్


మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పరిగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం సజావుగా జరిగింది. ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలో గడిచిన మూడు నెలల అభివృద్ధి నివేదికలతో పాటూ గ్రామాలలో నెలకొన్న సమస్యలపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుహాసినమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజ్, విద్యుత్, వైద్యం తదితర సేవలపై ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను కోరారు. కాగా ఊటుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులను కల్పించాలని సభలో చర్చించారు. అదేవిధంగా బసవనపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. మండలంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యలు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, మెడికల్ ఆఫీసర్ స్వరూపరెడ్డి, ఏఓ విజయభారతి, ఏపీఎం దేవానంద్, ఏపీఓ చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీబీఎస్‌సీ ఫలితాల్లో ప్రతిభ


ఆకర్షిణి


శాలిని


దీక్షిత


ఆత్రేయ

పావగడ: సీబీఎస్‌సీ ఫలితాల్లో తాలూకాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జే ఆకర్ష్ 90 శాతం మార్కులతో తాలూకాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే శాలిని 89 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, దీక్షిత 88.2 శాతం మార్కులతో తృతీయ స్థానాల్లో రాణించారు. విద్యార్థులకు మంచి మార్కులు రావడంతో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

హిందూపురం టౌన్: సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో పట్టణానికి చెందిన బీఎస్ ఆత్రేయ 500 మార్కులకు 485 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచాడు. ప్రతిభ కనబరచిన ఆత్రేయను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన


శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని లింగదహళ్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి స్పందన లభించింది. బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి, స్థానిక హెల్ప్ సొసైటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రముఖ వైద్యులు హరీశ్, గ్రీష్మ, గగన, ఆనంద్ రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మొత్తం 450 మంది రోగులను పరీక్షించి 38 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరికి సప్తగిరి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని నిర్వాహకుడు మానం శశికిరణ్ తెలిపారు.

కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 2024 – 25 విద్యా సంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు చేసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఎస్.ఎస్.సీ. మార్కుల జాబితా, టీసీ, స్టడీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రావాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726